సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం, 6, సెప్టెంబర్, 2024



హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు. 86 రోజులకు రూ.45,87,330 ఆదాయం సమకూరింది.



పోషకాహార మాసోత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 75వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పోషణ జీ పడాయి జీ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఎన్‌సీసీ సెలెక్షన్స్

పెంటపాడు: స్థానిక డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ సెలెక్షన్స్ నిర్వహించారు. 19 ఆంధ్రా బెటాలియన్ అధికారి కుల్విందర్‌సింగ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



పెంద్ర వీరన్న



తిరుమాని నాగరాజు

భీమవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాల్లో భాగంగా జిల్లాకు చెందిన పెంద్ర వీరన్న, తిరుమాని నాగరాజుకు పదవులు వరించాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అత్యంత వెనుకబడిన తరగతుల విభాగం అధ్యక్షుడిగా నరసాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పెంద్ర వీరన్న, అగ్నికుల క్షత్రియ విభాగం అధ్యక్షుడిగా వేములదీవి గ్రామానికి చెందిన తిరుమాని నాగరాజును నియమించినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం తెలిపింది.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



భీమవరం: వినాయక చవితి గణేష్ పందిళ్లు, మండపాల ఏర్పాట్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో మతసామరస్యాన్ని పాటించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు, రికార్డింగు డ్యాన్సులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో వాహన రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉత్సవ పందిళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, నిమజ్జనం రోజున ప్రమాదకర రంగులు జల్లడం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. ఉత్సవాల్లో బలవంతంగా వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

5 వేల బియ్యం బస్తాల తరలింపు



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

పాలకొల్లు సెంట్రల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పాలకొల్లు, పోడూరు మండలాల ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్ల నుంచి 5 వేల బస్తాల బియ్యం తరలించనున్నట్టు ఆర్డీఓ అత్యుత్ అంబరీష్ తెలిపారు. గురువారం ఆయన రైస్‌మిల్లులు, మట్టపర్రు, అడవిపాలెం ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్లను పరిశీలించారు. 25 కిలో చొప్పున 5 వేల బస్తాలు (125 టన్నులు)ను ఐదు లారీలో విజయవాడ తరలించామన్నారు. మట్టపర్రు గోడౌన్ నుంచి 3 వేలు, అడవిపాలెం గోడౌన్ నుంచి 2 వేలు బస్తాలను పంపామని, ప్యాకింగ్‌కు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు సహకారం అందించారన్నారు. బియ్యం తరలింపులో పాలకొల్లు, పోడూరు తహసీల్దార్లు వై.దుర్గాకిషోర్, సయ్యద్ ఫజల్, సీఎస్‌డీటీ ఐవీవీ సత్యనారాయణ, డి.రాజేష్ పాల్గొన్నారు.

బాలుడి దుర్మరణం

భీమవరం: పట్టణంలోని 6వ వార్డులో బొక్కావారిపాలెం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బొక్కా శ్రీనివాసరావు కుమారుడు లక్ష్మీ శ్రీగణేష్ (13) తాగునీరు కోసం వెళ్లి తిరిగి వస్తుండగా పాలకొల్లు నుంచి భీమవరం వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బాలుడు మృతిచెందినట్టు తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాపరిషత్ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాల కారణంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులను భాగస్వామ్యం చేసుకుని తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- లంక గ్రామాల్లో పలు చోట్ల గండి
- 13 గ్రామాల్లోకి చేరిన వరద నీరు
- ఏలూరు-కైకలూరు రహదారిలో నిలిచిన రాకపోకలు
- మరోవైపు కొనసాగుతున్న గోదావరి వరద తీవ్రత
- పోలవరం నుంచి 9.67 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- వేలేరుపాడులో జలదిగ్బంధంలో 29 గ్రామాలు
- పునరావాస కేంద్రంలో 150 కుటుంబాలు

ఉధృతంగా కొల్లేరు



ఏలూరు-కైకలూరు మధ్యలో పెద ఎడ్లగాడి వద్ద రహదారిపై చేరిన కొల్లేరు వరద నీరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వరద గోదావరితో ఏజెన్సీ ప్రాంతం.. బుడమేరు, తమ్మిలేరు వరద ఉధృతితో కొల్లేరు అతలాకుతలమవుతున్నాయి. కృష్ణా వరదలతో కొల్లేరు.. గోదావరి వరదలతో పోలవరం ముంపు మండలాల్లోని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రెండింట్లో ప్రమాదకర స్థాయిలో నీటిప్రవాహం ఉండటంతో వరద తీవ్రత రోజురోజుకూ పెరుగుతుంది. ఫలితంగా వేలేరుపాడు మండలంలో 29 గ్రామాలు, కొల్లేరు పరిధిలో 13 గ్రామాల్లో వరదనీరు చేరి జలజీవనం స్తంభించింది.

పోలవరం స్పిల్‌వేలో 32.520 మీటర్లు

పోలవరం ప్రాజెక్టుకు బుధవారం 8.22 లక్షల క్యూసెక్కులు, గురువారం 9.67 లక్షల క్యూసెక్కుల నీరు చేరింది. భద్రాచలం వద్ద కూడా 45.50 అడుగుల నీటిమట్టంలో ప్రవాహం ఉంది. మరో రెండు రోజులు పాటు వరద తీవ్రత కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలో 32.520 మీటర్ల ఎత్తు నుంచి 48 గేట్ల ద్వారా 9,67,437 క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతుంది. ఇదే పరిస్థితి శుక్రవారం కూడా కొనసాగితే పశ్చిమ గోదావరి జిల్లాలోని లంక గ్రామాలకు వరద ముంపు పూర్తిగా పొంచి ఉన్నట్లే. గోదావరితో పాటు శబరి ఉధృతి కూడా పెరగడంతో వేలేరుపాడు మండలంలో 29 గ్రామాలు, కుక్కునూరు మండలంలో పలు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. వరద నేపథ్యంలో గొమ్ముగూడేనికి చెందిన 150 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. వేలేరుపాడు-కోయిదా, వేలేరుపాడు-రుద్రమకోట రహదారులు పూర్తిగా నిలిచిపోయాయి.



కైకలూరు మండలం శృంగవరప్పాడు రోడ్డులో గండిని పరిశీలిస్తున్న దృశ్యం



వేలేరుపాడు మండలంలో వరద నీటిలో వెళుతున్న రేపాకగొమ్ము గ్రామస్తులు

ఓ వైపు బుడమేరు.. మరోవైపు తమ్మిలేరు

2006 తర్వాత మళ్లీ కొల్లేరు ఉగ్రరూపం దాల్చింది. 13 లంక గ్రామాల్లో నీరు చేరడం, శ్మశాన వాటికలు మునిగిపోవడం, ప్రధాన రోడ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ నుంచి బుడమేరు, ఏజెన్సీ నుంచి తమ్మిలేరు రెండు కూడా కొల్లేరు చేరుతుండటంతో కొల్లేరులో వరద తీవ్రత పెరిగింది. ఏలూరు-కొల్లేరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, శ్రీరామ్‌నగర్, ముచ్చుమిల్లి, పులపర్రు, కొవ్వాడలంక గ్రామ రహదారులు మునిగాయి. కైకలూరు మండలం పెంచుకలమర్రు, కొట్టాడ, శృంగవరపుపాడు ప్రమాద అంచున ఉన్నాయి. శృంగవరపుపాడు నుంచి పైడిచింతపాడు మీదుగా ఏలూరు చేరే రహదారిలో నాలుగు ప్రాంతాల్లో గండి పడింది. దీంతో ఆ రహదారిని మూసివేశారు. ఏలూరు రూరల్‌లోని ఏలూరు-గుడివాకలంక రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. గుడివాకలంక, కొక్కిరాయలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక, కలకుర్రు గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి.



వేలేరుపాడు మండలంలో నిత్యావసర వస్తువులు తీసుకెళ్తున్న రుద్రమకోట గ్రామస్తులు

గోదావరికి రెండోసారి వరద

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా చేరుతున్న వరద నీటితో ఏలూరు జిల్లా అతలాకుతలమవుతుంది. ప్రధానంగా గోదావరి వరద ఈ ఏడాది రెండవ పర్యాయం మొదలైంది. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు వరద గోదావరి ఉధృతితో పది రోజుల పాటు ఏజెన్సీ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. అయితే ఈ ఏడాది గోదావరి వరదలు రెండుసార్లు వచ్చాయి. జూలై 19 నుంచి ఆగస్టు మొదటివారం వరకు వరద తీవ్రత కొనసాగింది. అందులోనూ గోదావరి పోటెత్తడంతో పాటు ఖమ్మం జిల్లాలోని పెదవాగుకు గండిపడటంతో వేలేరుపాడులో 40 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో పాటు దాదాపు నెల రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయిన పరిస్థితి. మళ్లీ బుధవారం నుంచి గోదావరి వరద ప్రారంభమైంది.



పడవపై వేలేరుపాడు వస్తున్న రుద్రమకోట గ్రామస్తులు

సేవకు ప్రతిరూపాలు జిల్లా వాసులు

నరసాపురం: జిల్లా వాసులు సేవకు ప్రతిరూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం పట్టణంలోని తెలగా కల్యాణ మండపం వద్ద నుంచి విజయవాడ వరద బాధితులకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపారు. సుమారు 5 వేల మందికి సరిపడ సరుకులను 14 వాహనాల్లో పంపించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై వాహనాలను జెండా ఊపి పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలోనూ విపత్తుల సమయంలో జిల్లావాసుల సేవాతత్పరతను చూపారన్నారు. మరింత మంది దాతలు ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ దుప్పట్లు, వాటర్ బాటిళ్లు, మందులు కూడా పంపిస్తున్నామన్నారు. ఆర్డీఓ ఎం.అత్యుత్ అంబరీష్, తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకల సతీష్ పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేం

భీమవరం: వరద బాధితుల కోసం దాతల సాయం మరువలేనిదని కలెక్టర్ నాగరాణి అన్నారు. గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తయారుచేసిన 5,100 పులిహోర ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్ బాక్సులను కలెక్టర్ పర్యవేక్షణలో విజయవాడ తరలించారు. తహసీల్దార్లు ఏవీ రామాంజనేయులు, రావి రాంబాబు ఉన్నారు. జిల్లా నుంచి గురువారం ఆహార పొట్లాలు 61,350, వాటర్ బాటిళ్లు 82,900, బిస్కెట్ ప్యాకెట్లు 9,800, పాల ప్యాకెట్లు 8 వేలు, బన్నులు 7 వేలు, కూరగాయలు మూడు టన్నులు, నిత్యావసర వస్తువులు 3 టన్నులు, బియ్యం 15 టన్నులు, 500 దుప్పట్లు, రస్కుల ప్యాకెట్లు 3 వేలు విజయవాడకు పంపించామన్నారు.



వాహనాలకు జెండా ఊపుతున్న కలెక్టర్ నాగరాణి

దేశ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని కేంద్ర భారీ, ఉక్కుపరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన గురుపూజోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాత్ర తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి దోహదపడాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి మెట్లు అని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలోనే ఉపాధ్యాయులుగా మంచి గుర్తింపు పొందుతారన్నారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను సమాజానికి ప్రయోజనకారులుగా, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. డీఈఓ జి.నాగమణి మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి విద్యాశాఖ నిరంతర కృషి చేస్తోందన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పూలమాల వేసి, శాలువా కప్పి, మెమెంటో, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యాంసుందర్, భీమవరం, తణుకు ఉప విద్యాశాఖాధికారులు పి.నాగరాజు, డి.మురళీ సత్యనారాయణ పాల్గొన్నారు.



భీమవరంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అనుమానమే.. పెనుభూతమై

- భార్య ముఖంపై దిండుతో నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య
- ఆపై పురుగుమందు తాగి భర్త ఆత్మహత్యాయత్నం

ఉండి: అనుమానమే పెనుభూతమై కట్టుకున్న భర్తే కాలయముడై ఆమెను కడతేర్చాడు. ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమె ముఖంపై దిండుతో ఊపిరాడనీయకుండా అదిమి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండి గోరింతోట ప్రాంతానికి చెందిన గొల్ల చిరంజీవికి కలిగొట్ల గ్రామానికి చెందిన సత్యవతి (రేఖ) (36)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. చిరంజీవి గతంలో మస్కట్‌లో పనిచేయగా, ప్రస్తుతం లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ప్రభుత్వంలో మృతురాలు వలంటీర్‌గా పనిచేసింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెతో అప్పుడప్పుడు గొడవపడుతూ ఉండేవాడు. ఇటీవల తరచూ గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మరోసారి వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చి మళ్లీ గొడవకు దిగాడు. అక్కడితో ఆగకుండా అత్యంత పాశవికంగా ఆమె ముఖంపై దిండుతో గట్టిగా నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం ఎలుకల మందు తాగి స్వగ్రామం ఉండి శివారు గోరింతోటకు వెళ్లిపోయాడు. అక్కడ బంధువులకు విషయం చెప్పడంతో వారి బంధువుల్లో ఒకరు మృతురాలి సోదరుడు ప్రసాద్‌కు ఫోన్ చేసి మీ బావ ఎలుకమందు తాగాడని, అతని బట్టలు తీసుకుని ఆసుపత్రికి రావాలని చెప్పాడు. అయితే అతను ఈ విషయాన్ని తల్లికి చేరవేడంతో ఆమె తన కుమార్తెకు చెప్పేందుకు ఇంటికి వెళ్లగా, అప్పటికే కుమార్తె మృతి చెంది ఉంది. దీంతో జరిగిన ఘోరాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే ఘటనా స్థలికి చేరుకున్న క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎలుకల మందు తాగిన నిందితుడైన భర్త అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతురాలి తల్లి భూపతి సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్సై నసీరుల్లా కేసు నమోదు చేయగా, ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.



సత్యవతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెంలో ఒంటరి మహిళ హత్య



బొబ్బిలి దేవి (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని నాలుగో వార్డులో ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేతివారివీధిలో బొబ్బిలి దేవి (50) నివాసం ఉంటోంది. పదేళ్ల క్రితం భర్త నాగేశ్వరరావు మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. దేవి కూరగాయలు దుకాణం, పాన్‌షాపు నిర్వహిస్తుంది. ఆమెతోపాటు ఇంటిలో పెద్దకుమార్తె ఒమ్మి రాజ్యలక్ష్మి, అల్లుడు నివాసం ఉండేవారు. నెల క్రితం వీరిద్దరూ ఉద్యోగం నిమిత్తం దుబాయి వెళ్లారు. అప్పటి నుంచి దేవి ఒంటరిగా ఉంటోంది. పెద్దకుమార్తెకు ఆటో ఉండగా, దీనిని పట్టణానికి చెందిన కరిమి సాయికి అద్దెకు ఇచ్చారు. రోజూ రాత్రి అద్దె చెల్లించి ఆటోను దేవి ఇంటి వద్ద ఉంచి ఉదయాన్నే వచ్చి ఆటోను తీసుకువెళతాడు. బుధవారం రాత్రి యధావిధిగా ఆటోను దేవికి అప్పగించి వెళ్లాడు. గురువారం ఉదయం సాయి ఆటో తీసుకువెళ్లేందుకు రాగా, దేవి ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులను బలవంతంగా తెరిచి లోనికి వెళ్లి చూడగా దేవి తలకు గాయమై రక్తంతో కింద పడి కనిపించింది. సీఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించగా, దేవి తలకు, మెడకు గాయాలు ఉండటాన్ని, మెడలో గొలుసు, చేతికి ఉంగరాలు లేకపోవడాన్ని గుర్తించారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించగా జాగిలం దేవి ఇంటి నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు వచ్చి ఆగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎస్ మృతికి సంతాపం



ఆర్ఎస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

భీమవరం: మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు నాయకుడు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మరణం పట్ల పలువురు సంతాపం తెలిపారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు బి.బలరామ్, జేఎన్‌వీ గోపాలన్, జుత్తిగ నర్సింహమూర్తి, సీపీఐ నాయకులు కోనాల భీమారావు, చెల్లబోయిన రంగారావు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఉండిలో అధిక వర్షపాతం

భీమవరం: జిల్లాలో గురువారం ఉదయం 8.30 గంటల వరకు ఉండిలో అత్యధికంగా 84.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మండలాల వారీగా ఆకివీడులో 65, భీమవరంలో 57.6, పాలకొల్లులో 48.6, ఇరగవరంలో 43.2, తాడేపల్లిగూడెంలో 20.4, పెంటపాడులో 19.4, తణుకులో 26.2, అత్తిలిలో 24.6, గణపవరంలో 16.8, పాలకోడేరులో 32.6 మి.మీ వర్షం కురిసింది. పెనుమంట్రలో 12.4, పెనుగొండలో 18.8, ఆచంటలో 25, పోడూరులో 28.2, వీరవాసరంలో 24.8, కాళ్లలో 21.4, మొగల్తూరులో 20.8, నరసాపురంలో 28, యలమంచిలిలో 17.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ప్రకృతి వ్యవసాయ సదస్సులో రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై సరైన అవగాహన పెంచుకొని ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధికలాభాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై. నూకరాజు పేర్కొన్నారు. గురువారం అలంపురం ఆర్బీకే సెంటర్‌లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు, సభ్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ లింగాకర్ష బుట్టలు, ఎల్లో ప్లేట్, బయో కల్చర్, అజోల్లా తదితర విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు, తెగుళ్ల సోకకుండా రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, గూడెం, పెంటపాడు ఇన్‌చార్జిలు రత్నాజీ, వీర్రాజు, సుబ్బారావు, నాగకృష్ణ రైతులు, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బందిపాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

అత్తిలి: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. గురువారం మంచిలి సెక్టార్ కొమ్మర అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు బోధనోపకరణాల ద్వారా నాణ్యమైన విద్యను అందజేస్తున్నామన్నారు. బోధనోపకరణ ప్రయోజనాలను తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం మెనూ ప్రకారం పిల్లలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి శిల్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు రాణి, మణి, మేనక, ఆశావర్కర్లు లక్ష్మి, విజయ, కాంత తదితరులు పాల్గొన్నారు.

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం వారి సంయుక్తంగా గురువారం స్థానిక 33వ వార్డులోని సిపాయి పేట భవనంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి, జనతా చారిటబుల్ ట్రస్ట్ వారి పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రావు శిబిరంను ప్రారంభించారు. మెగా వైద్య శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. మానవత పట్టణ అధ్యక్షుడు పత్సా వెంకటేశ్వరరావు, కార్యదర్శి యర్రా ఆంజనేయస్వామి, కోశాధికారి యెగ్గిన శరత్ బాబు, బంగ్గారాజు, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, అత్తిలి బాబి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని విశిష్టతపై కళాజాత ప్రదర్శన

తణుకు: కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విశిష్టత తెలియజేస్తూ గురువారం తణుకులో కళాజాత బృందం ప్రదర్శన నిర్వహించారు. తణుకులోని బస్టాండు, నరేంద్ర సెంటర్, లక్ష్మిథియేటర్ ప్రాంతాల్లో వి.సత్యకృష్ణ ఆధ్వర్యంలో పర్యావరణ భద్రత, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు.

ఉత్తమ గురువులకు సత్కారం



ఎస్.శామ్యూల్ జాన్సన్, ఆర్వీ సూర్యనారాయణ, ఎ.మణిక్యమ్మ, బి.చంద్రశేఖర్, బి.సుబ్బారావు, కె.వెంకటరావులను సత్కరించిన కేంద్ర మంత్రి, కలెక్టర్, ఎస్పీలు

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. విద్యాశాఖలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

- భీమవరం



ఎస్.సూర్యనారాయణ, డి.చింతయ్య, ఎం.బలరాముడు, పి.హరిబాబు, ఎన్‌బీ రత్నకుమారి, పి.రాధాకృష్ణ



ఎ.ఏసేపు, కె.రవికుమార్ వర్మ, జె.సునీత, పి.ధనలక్ష్మి, పి.కోటేశ్వరరావు, ఎం.రామచంద్రరావు



వై.సత్యనారాయణ, టి.వినోద, డీఎం గంగాప్రసాద్, డి.రూనీ విజయకుమారి, డీవీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు, జీఎన్.మారేశ్వరరావు



పి.కోటేశ్వరరావు, ఆర్.వెంకన్నబాబు, ఎ.జ్యోతి, పి.శ్రీనివాస్, వి.కిషోర్ బాబు, పి.కిషోర్



ఆర్.కృష్ణమోహన్, టి.విక్టర్‌బాబు, కె.నిర్మల, డీవీ సత్యనారాయణ, జి.బేబి ప్రశాంతి, సీహెచ్ఎస్‌వీఎస్ హరిరాజా



బీవీఎల్ ప్రసన్నదుర్గ, పి.వాణి పుణ్యవతి, వి.సూర్య కుమార్, కె.రామ్మోహనరావు, జి.శ్రీనివాస్, పి.కనక మహాలక్ష్మి



బి.రవి ప్రసాద్, ఎస్‌కే బాల ఈశ్వరయ్య, బి.రామకృష్ణ, బి.శ్రీనివాస్, కె.శ్రీదేవి, పి.గురుమూర్తి



కె.శ్రీనివాసరావు, కె.రాజశేఖర్, సీహెచ్ భాను ప్రకాష్, ఎం.సుధీర్ బాబు, వై.శ్రావణి, టీవీ భద్రాచార్యులు



కె.సాయిరెడ్డి, సీహెచ్‌వీ సత్యనారాయణ, జి.సుధాకర్, ఎంవీవీఎస్ఆర్ రాజరాజేశ్వరరావు, కె.సుధారాణి, రామాయణం శ్రీనివాస్



పి.శ్యామ్ సుందర్



డీఈఓ నాగమణి

ఎల్ఐసీని నిర్వీర్యం చేసే కుట్ర

తణుకు అర్బన్: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలబడిన ఎల్ఐసీను నిర్వీర్యం చేసే దిశగా ప్రైవేటుకు ధారాదత్తం చేసే ఐఆర్‌డీఏ సంకుచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా ఏజెంట్స్ అంతా ఐక్యపోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఎల్ఐసీ ఏఓఐ జోన్ జనరల్ సెక్రటరీ పీఎల్ నరసింహారావు అన్నారు. తణుకు బ్రాంచ్ కార్యాలయం వద్ద గురువారం ఐఆర్‌డీఏ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏజెంట్ వృత్తిలో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న చిన్నస్థాయి ఏజెంట్స్ అందరినీ డిజిటలైజేషన్ పేరుతో ఐఆర్‌డీఏ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. పేపర్‌లెస్ విధానంతో ఏజెంట్స్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. జీవిత బీమారంగాన్ని జీఎస్టీ నుంచి, ఎల్ఐసీ ప్రీమియంకు సంబంధించి ఆదాయ పన్ను నుంచి మినహాయించాలని, పాలసీ ప్రీమియం 5 లక్షలు దాటిన పాలసీలపై వచ్చే ఆదాయానికి పన్ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



తణుకు ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్స్ గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నరసింహారావు

బీమా సుగం, బీమా విస్తార్, జీవన్ వాహక్, బీమా విట్రాగ్, జీవన్ సమర్థ్, బిడ్డర్ వ్యవస్థలను నిలుపుదల చేయాలని కోరారు. ఎల్ఐసీ ఏఓఐ తణుకు బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు సత్తి పాండురంగారెడ్డి, అధ్యక్షులు సలాది ఉదయ భాస్కరరావు, కార్యదర్శి మడిచర్ల రవిరామకృష్ణ, కోశాధికారి ప్రసాద్, నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, బొలిశెట్టి రామనాథ్, చవ్వాకుల వెంకటేశ్వరరావు, బల్ల బాలకృష్ణ, సాంసన్, విజయ్, గంటి శ్రీనివాస్, వినయ్‌రాజా, సుందరం, ఊట గోవిందరాజు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

తణుకు టౌన్: పర్యావరణానికి హాని కలగని రీతిలో వినాయక విగ్రహాలను పూజించాలని జిల్లా లయన్స్ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి కోరారు. గురువారం తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో 500 మందికి మట్టి విగ్రహాలను అందజేశారు. ఈకార్యక్రమంలో స్వర్ణ క్లబ్ అధ్యక్షుడు బీ శేషారావు, కోశాదికారి వీ తులసీ, సభ్యులు వావిలాల వెంకట రమేష్, బీ వెంకట్రావు, శ్యామల, వావిలాల పవన్‌కుమార్, శాంతి ప్రసూన, ఏ శ్రీనివాస్, కె చంద్రశేఖర్, పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతిఒక్కరు మట్టి విగ్రహాలను వాడాలని జ్యోతి సొసైటీ నిర్వాహకులు దత్తు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. డీఎస్ చెరువు కార్యాలయం వద్ద గురువారం ఉచితంగా ఆరువేల విగ్రహాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కలర్స్ లేకుండా మట్టి విగ్రహాలైతే ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కాపాడుకోవచ్చునని చెప్పారు. పది సంవత్సరాలుగా విగ్రహాలను పంపిణి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సర్వేపల్లి సేవలు ఎనలేనివి

- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

అత్తిలి: విద్యావేత్తగా, ఉపాధ్యాయునిగా, పరిపాలనాదక్షునిగా విశేష సేవలు అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయులని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువుకే సమాజంలో సముచిత స్థానం ఉందని, ఉత్తమ గురువు వద్ద శిక్షణ పొందిన శిష్యులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈసందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీఎంజీ ప్రసాద్, మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న ఎన్ సుజాతదేవి, సంస్కృత ఉపాధ్యాయుడు ఎస్ పురుషోత్తంలను మెమెంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, స్థానిక నాయకులు గారపాటి ధర్మారావు, ఆకుల రామచంద్రరావు, ఆచంట సుబ్బారావు, దాసం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువుల పాత్ర కీలకం

తణుకు టౌన్: గురు పూజోత్సవ వేడుకలను తణుకు పట్టణంలోని వివిధ కళాశాలలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తణుకులోని ఎస్సీబీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో..

తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో జరిగిన గురుపూజోత్సవ వేడుకలలో ప్రిన్సిపాల్ కెప్టెన్ యూ లక్ష్మి సుందరిబాయి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కళాశాల అధ్యాపకులను విద్యార్థినీలు ఘనంగా సత్కరించారు. తణుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డీ రంగారావు, కడియాల సూర్యనారాయణ, ఆకుల వెంకటేశ్వరరావు, నల్లజర్ల వెంకటేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి ఎం రవి రిజనాల్డ్, పీవీ రమణ, ఎంఆర్ కోటేశ్వరరావు, సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..



తణుకు టౌన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ...



తణుకు అర్బన్: ఎల్ఐసీ కార్యాలయంలో మేనేజరు రాజశేఖర్‌ను సత్కరించిన ఏజెంట్లు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు తాడేపల్లి మోహనరావు 12 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్కారం పొందిన ఎం. శామ్యూల్‌రాజు(కొండేపాడు), వై. రమేష్‌బాబు (ముదునూరు), ఎం. పుష్పావతి (అలంపురం), కె. కిరణ్‌కుమార్ (మీనవిల్లూరు), పీఏ సూర్యనారాయణ (రాచర్ల), కె. ప్రసన్న (దర్శిపర్రు), వి.స్వాతి (బిళ్లగుంట), ఎస్. వేణుగోపాల్ (కె. పెంటపాడు), బి. సుజాత (పెంటపాడు), బి. సత్యనారాయణ(వల్లూరుపల్లి), కె. శోభనాద్రి (జట్లపాలెం), పి. శివకుమార్ (ఆకుతీగపాడు)లతో పాటు, పెంటపాడు మండల మానవత సభ్యులు, సీఆర్‌పీలు, పలు గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో గురుపూజోత్సవం...

తణుకు అర్బన్: గురుపూజోత్సవం సందర్భంగా తణుకు ఎల్ఐసీ బ్రాంచ్‌లో గురువారం బ్రాంచ్ మేనేజరు కేఎస్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజరు కె.శివ, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ జె.వెంకటేశ్వరరావు, పరమహంస, శ్రీనివాస్, సుధీర్‌లను ఏజెంట్స్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్స్ పీఎల్ నరసింహారావు, సత్తి పాండురంగారెడ్డి, సలాది ఉదయ భాస్కరరావు, బొలిశెట్టి రామనాథ్, రవి రామకృష్ణ, ప్రసాద్, రాజా, వూట గోవిందరాజు, కేదారిశెట్టి శ్రీనివాస్, నార్ని వీరవెంకట్రావు, గంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమాజంలో గురువుల పాత్ర కీలకమని లయన్స్‌క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. డైమండ్స్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా జరిగాయి. కొత్త సుభద్ర, బి.శ్రీనివాసరావు, చెల్లారావు, ఫణికిషోర్‌లను శాలువాతో సత్కరించారు. చెన్నారెడ్డి సతీష్, మునగాల జితేంద్ర కుమార్, డాక్టర్ కమల, ఆకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షులు దూలం నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువులు కేవీ కృష్ణారావు, రామలక్ష్మిలను సన్మానించారు. కార్యదర్శి కుంట్ల కనకదుర్గ, కోశాధికారి చల్లా ఇందిరాకుమారి, మహిళా వాకర్స్ పాల్గొన్నారు.

ఆరుగొలనులో ఉపాధ్యాయ దినోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ కొండేటి రవి ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను మెమెంటోలతో సత్కరించారు. జనసేన నాయకుడు ఉప్పలపాటి సత్యనారాయణ, కూటమి నాయకులు అడపా వీరన్న, చిక్కాల చిరంజీవి, ఎం.నాని, అడపా శ్రీనివాస్, చిక్కాల సీతారామనాయుడు, అడపా దానయ్య, వీరమళ్ల రాము, వీరమళ్ల రాంపండు, పూరేటి శ్రీనివాస్, గోపిరెడ్డి రాంబాబు, కోలా దుర్గ, కర్రి రాము పాల్గొన్నారు.


ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ ఆర్థికాభివృద్ధికి గణనీయమైన కృషి చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యాపారాభివృద్ధిలో 5వ స్థానంలో కొనసాగుతుందని తాడేపల్లిగూడెం శాఖ ఛీఫ్ మేనేజర్ పీపీ ఎస్ ఆర్ బాబు తెలిపారు. బ్యాంకు ఆఫ్ ఇండియా 119వ వార్షికోత్సవం సెప్టెంబర్ 7న జరుగుతున్న సందర్భంగా బ్యాంకు వ్యాపార వివరాలను బ్యాంక్ కార్యాలయంలో గురువారం బాబు పలు వివరాలను వెల్లడించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా పురోగమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేషన్ కమిటీ నాయకులు ఎస్ఎస్ ప్రసాద్, యూనియన్ జాయింట్ సెక్రటరీ బి.ఏడుకొండలు, వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ అభిషేక్, బ్యాంక్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ వెల్లడించారు. వన్‌టౌన్‌లోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అదే విధంగా టూ టౌన్‌లో మార్కెట్ ఫీడర్, యాగర్ల ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం తాళ్ళముదునూరుపాడు, కొబ్బరితోట, యాగర్లపల్లి, రామచంద్రరావుపేట పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

వర్గీకరణ వద్దు- ఐక్యతే ముద్దు



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మంగరాజు

పెంటపాడు: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌ల వర్గీకరణ యోచన ప్రభుత్వం తక్షణం మానుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక పెంటపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ విభజన పేరుతో ఎస్సీలకు ద్రోహం చేస్తే ఊరుకొనేది లేదన్నారు. ఈ విషయం పునరాలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గెడ్డం అచ్చిబాబు, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, వీరవల్లి సునీల్‌కుమార్, ఏలూరి రవి, బి. సన్ని తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..



ఆహార పొట్లాలను తీసుకువెళ్తున్న రెడ్డి సంఘం నాయకులు

పెంటపాడు: విజయవాడ వరద బాధితులకు రెడ్డి సంఘం అండగా ఉంటుందని ఉమ్మడి పశ్చిమగోదావరి రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. గురువారం వరద బాధితులకోసం, నాలుగు వేల ఆహార ప్యాకెట్లు, నిత్యావసరాలు, బియ్యం తదితర సామగ్రిని విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘ అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతిఒక్కరూ బాధితులకు అండగా ఉండాలన్నారు. కొవ్వూరి లక్ష్మణరెడ్డి, తమనంపూడి వెంకటరెడ్డి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, చంటిరెడ్డి, కర్రి వరహాలరెడ్డి, పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, నల్లమిల్లి చినగోపిరెడ్డి, కొవ్వూరి హరిదుర్గాప్రసాద్ రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప సముదాయానికి కనీస వసతులు కరువు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారంలోని ఇందిరమ్మ కాలనీలో కనీస వసతులైన తాగునీరు, విద్యుత్, రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎల్.అగ్రహారం ఇందిరమ్మ గృహ సముదాయాన్ని సీపీఐ బృందం పరిశీలించింది.